క్లుప్తంగా

మున్సిపల్ కార్మికులకు ప్రమాద బీమా



ఆత్మకూర్: మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్ విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులతో పాటు వాటర్‌మెన్లకు మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి ఆధ్వర్యంలో శనివారం సమగ్ర రక్షణ ప్లాన్ (ప్రమాద బీమా) ద్వార బీమా చేయించారు. ఒక్కొక్క కార్మికుడికి రూ.750 చొప్పున బీమా ప్రీమియం పోస్టల్ సిబ్బందికి చెల్లించారు. నిత్యం పట్టణ పరిశుభ్రతకు శ్రమిస్తున్న కార్మికుల సంక్షేమం కోసం చైర్‌పర్సన్ తన సొంత డబ్బులను వెచ్చించి బీమా చేయించడం సంతోషంగా ఉందని కార్మికులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శశిధర్, కౌన్సిలర్లు, వార్డుల అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్‌కు సన్మానం



వనపర్తి విద్యా విభాగం: గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ గోవర్ధన్‌సాగర్‌ను కొత్తకోట సగర యూత్ సభ్యులు శనివారం జిల్లా కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సగర సంఘం జిల్లా అధ్యక్షుడు మోడల తిరుపతయ్య మాట్లాడుతూ.. భవన నిర్మాణ రంగంలో సగరుల పాత్ర ముఖ్యమైందని, అలాంటి సగర బిడ్డ గోవర్ధన్‌సాగర్‌కు గ్రంథాలయ జిల్లా చైర్మన్‌గా ఎన్నిక కావడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కురుమూర్తిసాగర్, నరేంద్రసాగర్, మాజీ సర్పంచు జయరాములు, పట్టణ అధ్యక్షుడు సురేష్‌సాగర్, వినోద్‌సాగర్, కురుమూర్తి, రమేష్ సాగర్, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సూచనలు పాటించాలి



పాన్‌గల్: గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటూ వైద్యుల సూచనలు పాటించాలని ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ మైథిలి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత్ మాతృవ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య విషయాలు, తీసుకోవాల్సిన పౌష్టికాహారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సమతుల్య ఆహారం తీసుకోవడంతో ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిస్తారన్నారు. పీహెచ్‌సీలో మెరుగైన వైద్య సేవలు అందుతాయని, అక్కడే కాన్పులు చేయించుకోవాలని, 108 వాహనాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పాన్‌గల్: మండలంలోని చింతకుంట మాజీ సర్పంచ్ అనూష భర్త తిరుపతయ్య మూత్రపిండాల వ్యాధితో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు, డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ గోవర్ధన్‌సాగర్, మాజీ ఎంపీపీ వెంకటేష్‌నాయుడు, మాజీ జెడ్పీటీసీ రవికుమార్, వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ ఉస్మాన్, జూపల్లి యువసేన నాయకులు ఉన్నారు.

ప్రమాదకరంగా గుంత

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రం నుంచి నాయనోనిపల్లి మైసమ్మ జాతరకు వెళ్లే రహదారి పెద్దకార్పాముల రోడ్డు మలుపు వద్ద ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు, అమ్మవారి దర్శనానికి వెళ్లే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్ అండ్‌బీ అధికారులు పట్టించుకొని అసంపూర్తిగా రోడ్డుకు మరమ్మతు చేపట్టి గుంతను పూడ్చాలని గ్రామస్తులు, భక్తులు కోరుతున్నారు.



పాన్‌గల్‌లో ఎన్యుమరేటర్లకు బుక్‌లెట్లు అందజేస్తున్న డీఆర్‌డీఓ ఉమాదేవి



ఖిల్లాఘనపురంలో..



వీపనగండ్లలో..



పాలెంలో..

కుటుంబ సర్వేకు సహకరించండి

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమానికి ప్రజలందరూ సంపూర్ణంగా సహకరించాలని తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ప్రారంభమైన సర్వే కార్యక్రమాన్ని వారు బ్లాక్‌ల వారీగా పరిశీలించి ఎన్యుమరేటర్లకు సలహాలు, సూచనలు అందించారు.

590 కుటుంబాల వివరాల సేకరణ

పాన్‌గల్: ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా ఒక్కొక్క ఇంటి వద్ద వివరాల సేకరణకు అరగంటకు పైగానే సమయం పడుతుండటం, వివరాలల్లో వ్యక్తిగత వివరాలను ఇచ్చేందుకు నిరాకరించడం వంటి సమస్యలను ఎన్యుమరేటర్లు ఎదుర్కొన్నారు. మండల కేంద్రంలో సర్వే వివరాలను తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, అన్నారం, అన్నారం తండా, వెంగళాయిపల్లిలో ఎంపీడీఓ గోవింద్‌రావు, ఎంపీఓ రఘురాములు సర్వే వివరాలను పరిశీలించారు. మండలంలోని 28 జీపీల్లో 108 ఎన్యుమరేటర్లు కేవలం 590 కుటుంబాల వివరాలను సేకరించినట్లు అధికారులు పేర్కొన్నారు. సర్వేకు సంబంధించిన ఫాంలు, కోడ్ బుక్‌లెట్, స్టాంప్ ప్యాడ్లను మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్యుమరేటర్లకు డీఆర్‌డీఓ, మండల ప్రత్యేకాధికారి ఉమాదేవి అందజేశారు.

56 మంది ఎన్యుమనేటర్లు

మదనాపురం: మండలంలోని 17 పంచాయతీల్లో సర్వే చేసేందుకు 56 మంది ఎన్యుమనేటర్లను, ఆరు



రేవల్లి మండలంలోని బండరావిపాకులలో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ లక్ష్మీదేవి

గురు సూపర్‌వైజర్లు సర్వేను పర్యవేక్షించారు. ప్రతి ఇంటికి వెళ్లి 75 అంశాలపై ప్రభుత్వం ఇచ్చిన ఫార్మట్‌లో వివరాలు సేకరించారు. దుప్పల్లి, మదనాపురం, అజ్జకొల్లు, కొన్నూరు, దంతనూరు తదితర గ్రామాల్లో సర్వే కొనసాగగా.. తహసీల్దార్ అబ్రహం లింకన్ పరిశీలించారు.

కొత్తకోట రూరల్: మండలంలోని 24గ్రామాల్లో ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతుంది. ఎంపీడీఓ చెన్నమ్మ పాలెం గ్రామంలో కొనసాగుతున్న సర్వేను పరిశీలించి సిబ్బంది ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పెద్దమందడి మండలంలో..

పెద్దమందడి మండలంలోని 22గ్రామాల్లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే మొదలైంది. ఎంపీడీఓ సద్గుణ మండలంలోని వీరాయిపల్లిలో సర్వే విధా



నందిమళ్లలో ఎంపీడీఓ శ్రీనివాసులు

నం, పనితీరును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒక్కో ఎన్యుమరేటర్లకు 100 నుంచి 150 ఇళ్లు కేటాయించినట్లు ఎంపీడీఓ తెలిపారు.

గోపాల్‌పేట: మండలంలో 78 మంది ఎన్యుమరేటర్లు 328 ఇళ్లను సర్వే చేసినట్లు అధికారులు తెలిపారు. తహసీల్దార్ తిలక్‌కుమార్‌రెడ్డి తాడిపర్తి, చెన్నూరు గ్రామాల్లో పర్యటించారు. రేవల్లి మండలంలో ఎన్యుమరేటర్లు 34 కుటుంబాల వివరాలను నమోదు చేసుకున్నారు. రేవల్లి మండలంలో తహసీల్దార్ లక్ష్మీదేవి బండరావిపాకుల, శానాయిపల్లి, నాగపూర్ గ్రామాల్లో పర్యటించి సర్వేను పరిశీలించారు.

520 కుటుంబాల వివరాలు నమోదు

వీపనగండ్ల: మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో కలిపి మొదటి రోజు 520 కుటుంబాల వివరాలను నమోదు చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో మొత్తం 7,047 కుటుంబాలను గుర్తించామని, అందుకు 54 బ్లాక్‌లను ఏర్పాటు చేసి, 52 మంది ఎన్యుమరేటర్లు, ఆరుగురు సూపర్‌వైజర్లను నియమించారు.

అమరచింత: మండలంలోని ఆయా గ్రామాలతో పాటు మున్సిపాలిటీలోని వివిధ బ్లాక్‌ల్లో ఎన్యుమరేటర్‌లు ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను రాబట్టుకొనేందుకు ఒక ఇంటికి గంట సమయం పడుతుందని తెలిపారు. తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు, డీటీ రెడ్యానాయక్, ఆర్ఐ గోపాల్, ఎంపీఓ నరసింహులు తదితర అధికారులు సర్వే పనితీరును పరిశీలించారు.

ఖిల్లాఘనపురం: మండలంలో మొత్తం 10,140 ఇళ్లను గుర్తించగా.. శనివారం 526 కుటుంబాలలో మాత్రమే సర్వే చేసినట్లు ఏఎస్ఓ ప్రేమలత తెలిపారు. మండలంలో మొత్తం 77 మంది ఎన్యుమరేటర్లు, 22 మంది పర్యవేక్షకులుగా ఉన్నారని ఆమె చెప్పారు.



వీరాయిపల్లిలో..



దుప్పల్లిలో..



దేవరపల్లిలో..



అన్నారంతండాలో..

మల్లేశ్వరం ఎత్తిపోతలపై ప్రభుత్వం నిర్లక్ష్యం



పెంట్లవెల్లి: మల్లేశ్వరం ఎత్తిపోతల పథకంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మాజీ ఎమ్మెల్యే బీరంహర్షవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కృష్ణానది నుంచి మినీలిఫ్ట్ ఎత్తిపోతల పథకం కోసం రూ.30 కోట్ల నిధులకు సంబంధించి ప్రొసిడింగ్ ఇచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎత్తిపోతల పథకాన్ని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు పూర్తైతే మల్లేశ్వరం, వేముకల్, ఎంగంపల్లితండా, చెన్నంపల్లి, సోమశిల, మంచాలకట్ట గ్రామాల శివారులో ఉన్న దాదాపు 1400 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మినిలిఫ్ట్ ఎత్తిపోతల పథకంపై శ్రద్ధ తీసుకొని సాగునీరు అందించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు, సింగిల్‌విండో చైర్మన్ విజయరామారావు, మాజీ సర్పంచ్ రాజేష్, సురేందర్‌గౌడ్, ఎస్‌కే ఖాజా, మతిన్‌లు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై పోరాటం

అయిజ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేష్ ఆధ్వర్యంలో పట్టణ కార్యదర్శిని ఎన్నుకున్నారు. పట్టణంలోని అరోరా కళాశాలలో ఇంటర్ చదువుతున్న శ్రీధర్ రెడ్డిని కార్యదర్శిగా ప్రకటించారు. సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటం చేస్తానని.. విద్యార్థుల భవిష్యత్తుకు కృషి చేస్తానని శ్రీధర్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు లోకేష్, నరేష్, నిఖిల్, శేక్షావలి, శ్రీహరి, శ్రీనాథ్, వినీత్, ఉదయ్, రాఘవేంద్ర, విజయ్, అశోక్, వంశీ, బలరాం, సద్దాం, రహీం, నాని తదితరులు పాల్గొన్నారు.

భూలక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం

కొత్తకోట రూరల్: కొత్తకోట సమీపంలో గల వెంకటగిరి గుట్టపై ఉన్న ఆలయంలోని భూలక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకొని వేంకటేశ్వరస్వామి జన్మనక్షత్రమైన శ్రావణ నక్షత్రం రోజున స్వామి ఉత్సవమూర్తి విగ్రహాలను అర్చకులు పట్టు వస్త్రాలతో అలంకరించారు. పెద్ద ఎత్తున హాజరైన భక్తుల మధ్య అర్చకులు వేద మంత్రాలతో కల్యాణోత్సవాన్ని కనుల పండువగా జరిపించారు. శ్రీభూలక్ష్మీవెంకటేశ్వరస్వామి దంపతులకు అర్చకులు తలంబ్రాలు పోయగా ఆడపడుచులు అమ్మవారికి వడిబియ్యం పోశారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఆలయం చుట్టూ ఊరేగించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు. కార్యక్రమంలో



భూలక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణక్రతువు చేస్తున్న అర్చకులు, హాజరైన భక్తులు

అర్చకులు సింగరా ఆచార్యులుతో పాటు ఆలయ నిర్వాహకులు, సీడీసీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, వేముల శ్రీనివాస్‌రెడ్డి, మద్దిగట్ల శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.సురేందర్‌రెడ్డి, శ్రీనివాసులుశెట్టి, సుదర్శన్‌శెట్టి, బాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి, నాగార్జునరెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకటేష్‌యాదవ్, శివశంకర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు



అసంపూర్తిగా ఉన్న గ్రామ పంచాయతీ భవనం

శ్రీరంగాపురం: మండలంలోని వెంకటాపురం గ్రామంలో పాత గ్రామ పంచాయతీ భవనం శిథిలావస్థలో ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఈ విషయాన్ని గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా రూ.20 లక్షలు అభివృద్ధి నిమిత్తం మంజూరు చేశారు. పనులు ప్రారంభించి మధ్యలో నిర్మాణాన్ని నిలిపివేశారు. సంబంధిత కాంట్రాక్టర్‌ను సంప్రదించగా.. నిధులు మంజూరు కాకపోవడం మూలంగా పనులు పూర్తి చేయలేకపోతున్నామని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిర్మాణ పనులు పూర్తి చేయించి పంచాయతీ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ఓటరు నమోదు తప్పనిసరి



పాన్‌గల్‌లో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి



అమరచింతలో..

ఆత్మకూర్: 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ చాంద్‌పాషా, డీటీ ప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాలను వారు పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు ఉంటే వాటిని సరిచేసుకునే అవకాశం ఉందన్నారు. ఒకే కుటుంబంలోని సభ్యులు వివిధ వార్డుల్లో ఓటరుగా నమోదై ఉంటే వారు సైతం ఒకే వార్డు, ఒకే కుటుంబంలో ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు.

అమరచింత: 18ఏళ్ల వయస్సు కలిగిన యువత విధిగా ఓటరుగా నమోదు చేసుకుని ఓటు హక్కును కలిగి ఉండాలని తహసీల్దార్ రవికుమార్ అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో బీఎల్‌ఓలు తమ బూత్‌ల వద్ద ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాలను తహసీల్దార్ పరిశీలించారు. కార్యక్రమంలో డీటీ రెడ్యానాయక్, ఆర్ఐ గోపాల్ పాల్గొన్నారు.

పాన్‌గల్: అర్హులైన యువత ప్రత్యేక ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని పోలింగ్ బూత్‌ను ఆయన సందర్శించి వివరాలపై ఆరా తీశారు. 2025, జనవరి 1 నాటికి 18ఏళ్ల వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. మండలంలోని కొత్తపేట, రాయినిపల్లి గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను డీటీ అశోక్‌నాయుడు సందర్శించారు. కార్యక్రమంలో ఆర్ఐ మహేష్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

వీపనగండ్ల: మండలంలో 18 ఏళ్లు నిండిన యువత పోలింగ్ బూతుల వద్ద ఓటరు నమోదు కోసం బీఎల్‌ఓలకు దరఖాస్తులు అందజేశారు. ఆదివారం కూడా ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపు నిర్వహిస్తున్నట్లు బీఎల్‌ఓలు తెలిపారు. కార్యక్రమంలో సుగుణబాయి, సువర్ణ, మహేశ్వరి, ఎల్లమ్మ, పారిజాత, చంద్రకళ, బలుస లక్ష్మి, కృష్ణమ్మ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగంగా మద్యం తాగితే చర్యలు

వనపర్తి రూరల్: మండలంలోని మర్రికుంట సమీపంలో బహిరంగ ప్రదేశంలో కొందరు యువకులు మద్యం తాగి అల్లరి చేస్తుండడంతో వారిపై శనివారం కేసు నమోదు చేశామని ఎస్ఐ జలంధర్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి మండలంలోని మర్రికుంట గ్రామ శివారులో కొందరు వ్యక్తులు మద్యం తాగి అల్లరి చేయడంతో స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు అక్కడికి చేరుకొని మద్యం తాగిన వ్యక్తులను అదుపులోకి తీసుకొని ఓపెన్ బూజింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగరాదని, అలాగే చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

స్వర్ణకారుల అభ్యున్నతికి కృషి



ఆత్మకూర్: శ్రీవిరాట్ విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం ఆత్మకూర్ మండల అధ్యక్షుడిగా డీకే విశ్వప్రకాష్ ఆచారి ఎన్నికయ్యారు. శనివారం ఆత్మకూర్‌లో శ్రీవిరాట్ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకొన్నారు. మండల ఉపాధ్యక్షుడిగా జన్నారం నరేష్, ప్రధాన కార్యదర్శిగా బాలరాజు, కోశాధికారిగా భాస్కర్‌చారి, గౌరవ సలహాదారులుగా శాంతాచారి, యాదయ్యచారి, మురళీధర్, బంగారు భాస్కర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విశ్వబ్రాహ్మణులు, స్వర్ణకారుల అభ్యున్నతికి పాటుపడాలని కోరారు.

మాదాసి కురవగా నమోదు చేయించాలి

శాంతినగర్: కులగణన సర్వేలో కురువ కులస్తులంతా మాదాసి, మాదారి కురువగా నమోదు చేయించుకోవాలని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి పల్లయ్య సూచించారు. వడ్డేపల్లి మున్సిపాలిటి శాంతినగర్‌లో శనివారం సంఘ సమావేశం నిర్వహించారు. నడిగడ్డ ప్రాంతంలో కురువ కులం వారికి బీసీ పేరు మీద చాలా ఏళ్ల నుంచి తప్పుడు సర్టిఫికెట్లు ఇచ్చి చాలా కాలం నుంచి తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్యుమరేటర్లు కూడా కులం కాలంలో సీరియల్ నంబర్ 080గా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు పెద్ద సోమన్న, అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షుడు మల్లికార్జున్, శాగూర్ కృష్ణ, సంకపురం రాముడు, తిక్కయ్య పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికే కొనుగోలు కేంద్రాలు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ జిల్లా చైర్మన్ శ్రీనివాసులుగౌడ్



కొత్తకోటలో..

ఖిల్లాఘనపురం: రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర అందించి, వారి అభ్యున్నతికి తోడ్పాటు అందించేందుకు ప్రభుత్వం జిల్లాలోని అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, సింగల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని రోడ్డుమీదితండా, అల్లమాయపల్లి, సల్కెలాపురం, మామిడిమాడ, పర్వతాపురం, ఖిల్లాఘనపురం గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఓ మల్లయ్య, సింగల్‌విండో వైస్ చైర్మన్ క్యామరాజు, వెంకటేశ్వర్‌రావు, డైరెక్టర్లు శ్యాంసుందర్‌రెడ్డి, రాములు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: కొత్తకోట సమీపంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని మదనాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం సూచించిన విధంగా 14శాతం తేమ ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈవో బాలరాజు, కాంగ్రెస్ నాయకులు మోహన్‌రెడ్డి, సంద వెంకటేష్, రాములుయాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, రైతులు జలేందర్‌రెడ్డి, రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

వనపర్తి రూరల్: మండలంలోని కడుకుంట్లలో సింగిల్ విండో ద్వారా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీఈఓ గోపాల్, డీసీఎంఎస్ డైరెక్టర్ కొమ్ము బాలయ్యతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పోతులపల్లి రాజు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ తిరుమల్, డైరెక్టర్ చిన్నారెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: మండలంలోని నందిమళ్ల, పాంరెడ్డిపల్లి, చంద్రగఢ్, నాగల్‌కడ్మూర్ గ్రామాల్లో ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని సింగిల్‌విండో వైస్ చైర్‌పర్సన్ శ్రావణి అన్నారు. రైతులు ధాన్యం తేమ 14శాతం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సింగింల్‌విండో డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలకు తరలిరావాలి

వీపనగండ్ల: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమవుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఎండగట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించనున్న సీపీఎం జిల్లా మూడో మహాసభలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట ఘటనలతో ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని పార్టీ సీనియర్ నాయకుడు తూంకుంట భాస్కర్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఎన్నో పోరాటాలకు నిలయంగా మారిన వీపనగండ్లలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు భారీ బహిరంగసభ ఉంటుందన్నారు. ఈ బహిరంగ సభకు మాజీ ఎంపీ, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు వెంకట్, రాష్ట్ర నాయకులు జాన్‌వెస్లీ, సాగర్ పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, నాయకులు మౌలాలి, మహబూబ్‌ఫాషా, మురళీ, సీహెచ్ వెంకటయ్య, ఆశన్న, ఈశ్వర్, లక్ష్మణ్, ఆది, మహేష్, నర్సింహ, వెంకన్న, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



వీపనగండ్లలో ఫొటో గ్యాలరీని ప్రారంభిస్తున్న సీపీఎం నాయకులు

పాన్‌గల్: సీపీఎం పార్టీ జిల్లా మహాసభల్లో భాగంగా ఈనెల 10వ తేదీన వీపనగండ్ల మండల కేంద్రంలో నిర్వహించే పార్టీ బహిరంగ సభకు మండలంలోని ప్రతి గ్రామం నుంచి పార్టీ సభ్యులు, కార్మికులు, రైతులు, కూలీలు, వృత్తిదారులు, పేదలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పార్టీ మండల కార్యదర్శి బాల్యానాయక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అమరచింత: వీపనగండ్ల మండల కేంద్రంలో ఈనెల 10, 11 తేదీలోల జరిగే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయడానికి ప్రతి ఒక్కరూ తరలిరావాలని సీపీఎం జిల్లా కమిటీ నాయకుడు వెంకటేష్ కోరారు. మండలంలోని పాంరెడ్డిపల్లిలో శనివారం సీపీఎం పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ సీపీఎం పార్టీ అనుబంధ సంఘాలలో ఉన్న కార్మికులతో పాటు పార్టీ సభ్యులు మహాసభల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349
వనపర్తి - ఎ. గణేష్ కుమార్ - 91605 62261
కొత్తకోట / పెబ్బేర్ - ఓ. రాజశేఖర్ గౌడ్ - 97000 09392
టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండంత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :
యాడ్స్ మేనేజర్ 9951602829
జబ్బర్ లాల్ : 9553955603